# పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి 1100 కాల్ సెంటర్ : జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10, ప్రభాతవార్త** ఫిర్యాదుల పరిష్కారానికి 1100 కాల్ సెంటర్ను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి. పౌరులు తమ ఫిర్యాదులను సత్వర పరిష్కారం కోసం నమోదు చేసుకోవడానికి 1100 కాల్ సెంటర్ అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ప్రజలకు తెలియజేశారు. ఈ టోల్‌ఫ్రీ నంబర్ ప్రభుత్వ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగం, ఇది పౌరులు లేవనెత్తిన సమస్యలను సంబంధిత విభాగాలకు పంపి సకాలంలో పరిష్కరించేలా చేస్తుంది. ప్రభుత్వ సేవలు, స్థానిక సమస్యలు లేదా ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన సమస్యలను నివేదించడానికి పౌరులు ఏ ఫోన్ నుండి అయినా 1100కు ఉచితం గా కాల్ చేయవచ్చు. ఫిర్యాదులను తెలుగు, ఇంగ్లీష్ భాషలలో సౌలభ్యం కోసం నమోదు చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని అందరు నివాసితులకు విజ్ఞప్తి చేశారు మరియు అందుకున్న ప్రతి ఫిర్యాదు పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించబడుతుందని హామీ ఇచ్చారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

**నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూష**





**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 10, ప్రభాతవార్త** ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు రెవెన్యూ డివిజన్లోని ప్రజలు ప్రతి ఇంట్లో జాతీయ జెండాను ఎగురవేసి కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన విధంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తమ దేశభక్తిని చాటుకోవాలని నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జాతీయ పతాకానికి గౌరవ వందనం చేయాలని సూచించారు. అవకాశం ఉంటే ప్రభుత్వం నిర్వహించే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో కూడా ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తమ ఇళ్లపై ఏర్పాటు చేసుకునే విషయంలో జాతీయ జెండా ప్రతిష్టకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలన్నారు.

## ప్రభుత్వ శిలాఫలకాల ధ్వంసం కేసులో ఇద్దరు అరెస్ట్

**రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రగ అనుమానం : డిఎస్పి శ్రీధర్**



**కావలి, ఆగష్టు 10, ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పెదపట్టపుపాళెం గ్రామంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్‌కు సంబందించిన ప్రభుత్వ శిలాఫలకాలను ధ్వంసంచేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కావలి డిఎస్పి శ్రీధర్ తెలిపాడు.ఈ సందర్భంగా కావలి డిఎస్పి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో డిఎస్పి శ్రీధర్ మాట్లాడారు.జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్‌కు సంబందించిన ప్రభుత్వ శిలాఫలకాలను ధ్వంసం చేసిన సంఘటన వెనుక రాజకీయ పార్టీల మద్య విభేదాలు సృష్టించే కుట్రవుందని ఆయన తెలిపారు.అరెస్ట్ అయిన వారిలో పామంజి యానాదయ్య,కోడూరు జక్రయ్య వున్నారని మిగిలిన ఐదుమంది నిందితులు ప్రేమ్‌సాగర్,వాయిల తిరపతి,కొమరి రాజు,కొమరి శ్రీను,ఏడుకొండలు పరారిలో వున్నారని వివరించారు.ప్లాట్ల వ్యాపారంలో శిలాఫలకాలు అడ్డంగ వుండడంతో వాటిని కూల్చివేసి ఆనేరాన్ని కూటమి ప్రభుత్వంపై మోపి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని వెల్లడించారు.ఈకేసులో మరింత దర్యాప్తు జరగుతుందని మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కావలి రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ రాజేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ ఫిరోజ్, టుటౌన్ సిఐ గిరిబాబు, రూరల్ సిఐ పాపారావు, రూరల్ స్టేషన్ ఎస్ఐలు తిరమలరెడ్డి,బాజీబాబు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి : మంత్రి నారాయణ

- సంక్షేమ ఫలాలు పేదలందరికి అందేలా చూడాలి
- సమయపాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందించండి
- నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి
- సచివాలయం సిబ్బందికి దిశా నిర్ధేశం చేసిన మంత్రి



**నెల్లూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త–వైద్యం** సచివాలయ సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని, సంక్షేమ ఫలాలు పేదలందరికి అందేలా చూడాలని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, నెల్లూరుని మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగా పని చేసే వాళ్ళకి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం సిబ్బందికి విధి విధానాలపై దిశా నిర్ధేశం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ఓల్డేజ్ హోమ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సచివాలయ సిబ్బందికి మంత్రి సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం అందేలా చూడాలన్నారు. 9వ డివిజన్లో 22 ఎకరాల్లో మోడల్ మార్కెట్‌ని ఏర్పాటు చేస్తున్నామని , పినాకిని పార్కులో వాటర్ స్పోర్ట్స్ రాబోతుందని తెలిపారు. ప్రధాన రహదారులను స్వీపింగ్ మిషన్లతో శుభ్రం చేసే పక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. పార్కులను ఆధునీకరిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్దం చేస్తున్నామని తెలిపారు. భగత్ సింగ్ కాలనీ వాసులకు శాశ్వత ఇళ్ల పట్టాలను కూడా అందజేశామన్నారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించడంలో కూటమి ప్రభుత్వం ముందుంది అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పథకాలను అనర్హులుగా ఉన్న వారి జాబితాను సిద్దం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని తెలిపారు. కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 10, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 15916 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 39.353 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 300,ఎన్ఎఫ్‌సికి 370, పెన్నా డెల్టాకు 1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 94.006మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# వీపీఆర్ దాతృత్వంతో కొండబిట్రగుంటకు కొత్త శోభ

- శోభాయమానం.. బిలకూటక్షేత్రం
- అంగరంగ వైభవంగా వీపీఆర్ దంపతుల చేతుల మీదుగా కోనేరుకు శంకుస్థాపన
- భక్తుల కలను సాకారం చేస్తున్న వేమిరెడ్డి దంపతులు
- కోనేరు నిర్మాణం పూర్తికి రూ.2.10 కోట్ల విరాళం
- వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు పూర్తి చేయాలని నిర్ణయం
- వెంకటేశ్వరస్వామికి సేవ చేయడం మా పూర్వజన్మ సుకృతం
- 1.65 కోట్లతో మహా ప్రాకార నిర్మాణానికి శంకుస్థాపన





**బిట్రగుంట, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఆధ్యాత్మికతకు సరికొత్త రూపం ఇస్తూ.. దాతృత్వంలో ఉన్నత శిఖరాన ఉన్న వేమిరెడ్డి దంపతులు మరో గొప్ప కార్యానికి శ్రీకారం చుట్టారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారు వెలసిన కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి కోనేరు పునరుద్దరణకు తమవంతుగా 2.10 కోట్ల విరాళం అందిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆధ్యాత్మికానందాల నడుమ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం కోనేరు శంకుస్థాపన కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే టీటీడీ బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొని శంకుస్థాపన చేశారు. అలాగే దేవాదాయ నిధులు 1.65 కోట్లతో ఆయన మహా ప్రాకారానికి కూడా శంకుస్థాపన పూర్తి చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజలు పార్టీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల వేదశీర్వాదం అందుకున్నారు. పూజల అనంతరం స్వామివారి వేంచేపుగా కోనేరు ప్రాంగణానికి రాగా.. వేమిరెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సతీమణి జ్యోతితో కలిసి ఆలయ మహాప్రాకారానికి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం వీపీఆర్ దంపతుల దాతృత్వంలో నిర్మించనున్న కోనేరుకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో కోనేరు పున:నిర్మాణానికి పూనుకోవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. దాదాపు 2.10 కోట్లతో పుష్కరిణి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు. స్వామివారు తమకు ఇచ్చిన దాంట్లోనే ఇదంతా చేస్తున్నామన్నారు. స్వామివారి పుష్కరిణి బాధ్యత మాకు దక్కడం అదృష్టమన్నారు. 800 ఏళ్ల చరిత్ర ఉన్న స్వామివారి ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కోనేరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రం, జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, జిల్లా సమగ్రాభివృద్ధి సాధించాలని కోరారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని పలుమార్లు అనుకున్నానని, కానీ కుదరలేదన్నారు. ఇప్పుడు కోనేరు శంకుస్థాపన సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శంఖు చక్రాలు తిరగేసి ఉండటం స్వామివారి ప్రత్యేకత అని చెప్పారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి 15 కోట్ల నిధులు సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అలాగే టీటీడీ తరుపున వేద పాఠశాల ఏర్పాటుపై చర్చిస్తామని ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ అడిగిన వెంటనే కాదనకుండా కోనేరు నిర్మాణానికి అంగీకరించిన వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో దాదాపు 15 కోట్ల నిధులతో ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. పాత కాలంలో బ్రిటీషర్లు స్వామివారి శక్తిని తగ్గించేందుకు తూర్పు దిశగా కాకుండా ఉత్తర దిశగా మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అందుకే ఆ తప్పులను సరిదిద్దేందుకు ఇప్పుడు తూర్పుదిశగా మెట్లు, ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎంతో మంది దాతల సహకారంతో స్వామివారి ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఇక్కడ వేద పాఠశాల ఏర్పాటు చేయాలని టీటీడీ బోర్డు మెంబర్ ప్రశాంతిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగం టి అలేఖ్య, ఆలయ ఈవో, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి నారాయణ

- మెప్మా మహిళలతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన మంత్రి
- షాపులు పెట్టే మహిళలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మహిళలు
- మైపాడు గేట్ సెంటర్ వద్ద స్మార్ట్ స్ట్రీట్ 240 షాపులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- తొలి విడతలో 120 షాపులు ప్రారంభం





**నెల్లూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త–వైద్యం** రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఓ మహిళను పారిశ్రామికవేత్తగా చేయాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి క్యాంపు కార్యాలయంలో మైపాడు గేట్ సెంటర్ వద్ద షాపులు పెట్టే మెప్మా మహిళలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో మోడల్‌గా మైపాడు గేట్ సెంటర్ వద్ద 240 షాపులు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. కంటైనర్లు యుద్ద ప్రాతిపదికన సిద్దమవుతున్నట్లు తెలిపారు. తొలి విడతలో 120 షాపులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి అన్నారు. మహిళలకు కార్పొరేషన్ మెప్మాల ద్వారా రెండు లక్షల రూపాయలు సబ్సిడీ అందుతుందని, బ్యాంకు ద్వారా రెండు లక్షలు లోన్ మంజూరు అయిందన్నారు. అయితే వీరికి మంత్రి నారాయణ సొంత నిధులతో ఆర్థిక సహాయం లక్ష రూపాయలు సాయం చేస్తానని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఈ షాపులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకొని అందరికి ఆదర్శంగా నిలవాలని మంత్రి కోరారు. తమ వ్యాపార అభివృద్ధికి సొంత నిధులు ప్రకటించిన మంత్రికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్.ఎన్.ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

- పోలీసులకు సమాచారం ఇవ్వని సిబ్బంది
- కళాశాల ఎదుట బాలిక బంధువుల నిరసన






**నెల్లూరు క్రైమ్, ఆగష్టు 10, ప్రభాతవార్త :** నెల్లూరు నగరం అన్నమయ్య సర్కిల్లోని ఆర్.ఎన్.ఆర్ జూనియర్ ఇంటర్ కాలేజీలో దారుణం చోటు చేసుకుంది. కళాశాలలో చదువుకుంటూ కళాశాల యాజమాన్యం నిర్వహిస్తున్న హాస్టల్లో ఉంటున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని హేమశ్రీ (16) హాస్టల్ గదిలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా సత్యవేడు ప్రాంతానికి చెందిన తిరుపాలు కుమార్తె అయిన హేమశ్రీ ఇటీవల ఆర్.ఎన్.ఆర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరింది. చదువుల్లో చురుగ్గా ఉండే ఈ అమ్మాయి హఠాత్తుగా ఆత్మహత్య చేసుకోవడం వెనుక కారణాలు తెలియడం లేదు. మరోవైపు ఈ సంఘటనలో కళాశాల యాజమాన్యం ప్రవర్తించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. హేమశ్రీ ఆత్మహత్యకు పాల్పడిన వెంటనే గుట్టుచప్పుడు కాకుండా కనీసం స్థానిక పోలీస్ స్టేషన్కు కూడా సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా ఆసుపత్రికి తరలించారు. హేమశ్రీ ఆరోగ్యం బాగోలేదని ఆసుపత్రిలో చేర్పించామని తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు మృతురాలి బంధువులు ఆరోపించారు. ఆత్మహత్య జరిగిన వెంటనే కళాశాలకు వారం రోజులు పాటు సెలవులు ఇస్తూ విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం వెనక కూడా ఏదో బలమైన కారణం కనిపిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. హేమ శ్రీ తల్లిదండ్రులు ఆర్.ఎన్.ఆర్ కాలేజీ వద్దకు చేరుకుని ఆందోళనకుదిగారు. సమాచారం అందుకున్న వేదాయపాలెం సీఐ కె శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తమ దృష్టికి కూడా తీసుకురావలేదని తెలిపారు. కళాశాలలో సమాచారం అందించేందుకు కూడా ఎవరు అందుబాటులో లేకపోవడం విచారకరం అన్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో బాలిక తల్లిదండ్రులు బంధువులు ఆందోళనలను విరమించారు.

### ఆర్.ఎన్.ఆర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆర్ఎన్ఆర్ ప్రవేట్ జూనియర్ కళాశాల హాస్టల్ లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరపాలని, విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, .ఈ ఘటనకు బాధ్యులైన సిబ్బంది కళాశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నీ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శిఖరం నరహరి, జి ఈశ్వరయ్యలు డిమాండ్ చేశారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతులు లేకుండా కళాశాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న హాస్టల్ లను వెంటనే సీజ్ చేయాలని కోరారు. అనుమతులు లేకుండా హాస్టళ్లను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మానసిక శారీరక ఒత్తిడికి లోను చేస్తూ విద్యా బోధన పేరుతో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కళాశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జనవరి నాటికి క్రీడా మైదానం ఏర్పాటు

## - జడ్పి హైస్కూల్ విద్యార్థులను అభినందించిన టిడిపి పార్టీ మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్




**ముత్తుకూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అదానీ పోర్ట్ సహకారంతో జనవరి నాటికి క్రీడా మైదానం ఏర్పాటు చేయనున్నట్లు టిడిపి పార్టీ మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా స్థాయి ఆంధ్రప్రదేశ్ టి - 10 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జడ్పి హైస్కూల్ ముత్తుకూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. వీరు త్వరలో ఒరిస్సా రాష్ట్రంలో పూరీలో జరిగే జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు పాల్గొంటారని టిడిపి పార్టీ మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. అధానీ కంపెనీ సిఎస్ఆర్ జయేష్ రంజన్‌కు మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యగారి ఏడుకొండలు, శంకర్, ముత్యం గౌడ్, ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాసులు, అధానీ కోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్ఎన్ఆర్ విద్యార్థి మృతిని వెలుగులోకి తీసుకొచ్చిన జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** నెల్లూరు అన్నమయ్య సర్కిల్ నందు ఆర్ఎన్ఆర్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన హేమశ్రీ మృతి చెందిన విషయంపై శేషం సుదర్శన్ విచారణ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన విషయం పట్ల ఎమ్మార్వో కృష్ణ ప్రసాద్‌ను ఫోన్లో సంప్రదించి సంబంధిత విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా శేషం సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థి మృతి చెందడం చాలా బాధాకరమని మృతికి గల కారణాలు పోలీసులు లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని, కాలేజీ యాజమాన్యం కూడా విద్యార్థికుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## అంకమ్మ తల్లికి విశేష పూజలు



**విడవలూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త:** గ్రామదేవతగా వెలసియున్న శ్రీ అంకమ్మ తల్లికి శుక్రవారం విశేష పూజలు అమ్మవారికి కొర్నాగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారికి అభిషేకం, పాలాభిషేకం, కుంకుమార్చన అత్యంత వైభవంగా అలంకరణతో నిర్వహించారు. అలాగే సాయంత్రం పల్లకి సేవ, భక్త మండలి భజన భక్తులచే భక్తి గీతాలు ఆలపించారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు.

## ఉపాధ్యాయ సంక్షేమానికి యూటీఎఫ్ కృషి

**ఉదయగిరి, ఆగస్టు 10, ప్రభాతవర్తా :** మండల కేంద్రమైన ఉదయగిరి యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సంక్షేమం సమస్యల పరిష్కారానికి యుటీఎఫ్ కృషి చేస్తుందని వ్యక్తలు తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని వారికి ఇతర పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ అధ్యక్షులు, కార్యదర్శులు యుటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు 50 వేల రూపాయాలు ఆర్థిక సహాయం



**చేజర్ల ఆగష్టు 10 ప్రభాతవార్త :** చేజర్ల గ్రామ రిటైర్డ్ టీచర్ జి.శ్రీదర్‌రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి స్వర్ణగౌరి ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్ధులకు చేజర్ల మండల యుటిఎప్ నాయకులకు ఆదివారం 50 వేల రూపాయాలు ఆర్ధిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎప్ సీనియనాయకులు ఏ.సుబ్బరత్నం, మాదాల రవిబాబుకు నగదు అందజేయడం జరిగింది.ప్రతి ఏడాది నిరుపేద విద్యార్ధులు చదువుల కోసం ఆర్ధిక సహాయం అందజేయడం జరుగుతుందని అన్నారు. పదో తరగతి విద్యార్ధులందరికి ప్రతి సంవత్సరం యుటిఎప్ ముద్రించిన మోడల్ టెస్టు పేపర్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. వారి సతీమణికి యుటిఎప్‌నాయకులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యుటిఎప్‌నాయకులు రమణయ్య,ఆర్‌వికృష్ణారెడ్డి,సుబ్రమణ్యం,వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## వేటకువెళ్ళి ఇద్దరు యువకులు మృతి



**కావలి,ఆగష్టు10,ప్రభాతవార్త:**సముద్రంలో వేటకువెళ్ళి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన కావలి రూరల్ మండలం తుమ్మలపెంట జరిగింది.కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు తుమ్మలపెంట పల్లెపాళెం గ్రామానికి చెందిన వెయ్యాల విష్ణు(20) ఐఆల శివకృష్ణ(19) మరియు నాంచారయ్యలు తుమ్మల పెంట సముద్రంలో వలతీసుకొని వేయులకు వెళ్ళారు ఆసమయంలో పెద్దసుడిగుండం వచ్చి అందులో మునిగిపోయి ఊపిరాడక విష్ణు,శివకృష్ణలు చనిపోయారు.నాంచారయ్య ఈదుకుంట బయటకువచ్చి చనిపోయిన విష్ణు,శివకృష్ణల తల్లిదండ్రులకు తెలిపాడు.వారి తల్లిదండ్రులు కావలిరూరల్ పోలీస్‌స్టేషన్‌కువచ్చి ఆదివారం ఫిర్యాదుచేశారని తెలిపారు.ఈమేరకు కావలిరూరల్ ఎస్ తిరుమలరెడ్డి కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపి రాష్ట్ర అద్యక్షులు పి.వి. ఎన్ మాదవ్ పర్యటనను విజయవంతం చేయండి : సిద్దన మనోహర్‌రెడ్డి



**బుచ్చి ఆగష్టు 10 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం భారతీయ జనతాపార్టీ కార్యాలయ ంలో రూరల్ మండల అద్యక్షులు సిద్దన మనో హర్‌రెడ్డి అద్యక్షతన మండల సమావేశం జరిగి ంది. ఈ సమావేశంలో మనోహర్‌రెడ్డి మాట్లా డుతు నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర అద్యక్షు లు పి.వి ఎన్ మాదవ్ రాష్ట్ర అద్యక్షు లుగా బాద్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్ర మంతట కూడా జిల్లా పర్యటనలు చేస్తు ఈనెల 13 వ తేదిన నెల్లూరు నగరానికి విచ్చేస్తున్న సందర్బంగా బిజెపి సానుభూతి పరులకు,బిజెపి నాయకు లకు,కార్యకర్తలకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. 13 వ తేది వ తేదిన మన నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని ఆరోజు ఉదయం వేదయపాళెం సెంటర్‌లో చాయ్‌పే చర్చ కార్యక్రమంలో పాల్గొం టారు. అనంతరం 10 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని సందర్శించి వారికి నివాళులు అర్పించి అక్కడ నుండి నేరుగా బయలు దేరి వి ఆర్ సి గ్రౌండ్‌కి చేరుకుంటారని,వీఆర్‌సి గ్రౌండ్ నుండి పెద్ద ర్యాలీగా మొదలై కస్తూర్బా కళాక్షేత్రం వరకు కొనసాగుతుందని కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని అన్నారు.బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలంలో 13 పంచాయితీలో గల బిజెపినాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల పూర్వ అద్యక్షులు గండి రఘురామయ్య, సీనియర్ నాయకులు వన్నెపంట బాల రాఘవరెడ్డి, మాటేటి రత్న ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి పెజ్జాయి క్రిష్ణారెడ్డి, మండల ఉపాధ్యాక్షులు పైడాల వెంకటేశ్వర్లురెడ్డి, కిసాన్ మోర్చ మండల అద్యక్షులు నెల్లూరు సుబ్రహ్మణ్యం, ఓబిసి మోర్చ మండల అద్యక్షులు గండి సుబ్రహ్మణ్యం, మైనార్టీ మోర్చ మండల అద్యక్షులు సయ్యద్‌చాన్‌భాషా, గిరిజన మోర్చ మండల అద్యక్షులు రాగి ప్రసాద్, మండలంలోని బూత్ కమీటి అద్యక్షులు క్రీయాశీలక సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నిరసన తెలియజేసిన టీపీ గూడూరు మండల సీపీఎం నాయకులు




**తోటపల్లిగూడూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త** తోటపల్లి గూడూరు మండలం మహాలక్ష్మీపురం లో వెంకన్నపాలెం ఆక్సిలరీ శాఖ కార్యదర్శి చింతా రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం పార్టీ మండల కమిటీ నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, మండల కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ ప్రజలకు స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ బిల్లులు భారంగా మారాయని ఆదాని కోట్లు కూడపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ మీటర్ల ప్రక్రియని అప్పటి ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని పిలుపునిచ్చారు. కానీ నేడు ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడంలో కూటమి తెలుగుదేశం ప్రభుత్వం ముందు ఉందని గత ప్రభుత్వం చేసింది తప్పు అయితే మీరు చేస్తుంది తప్పేనని ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఆదాని స్మార్ట్ మీటర్లు బిగింపు వ్యతిరేకంగా విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మహాలక్ష్మీపురం సెంటర్లో కకరపత్రాలను పంపిణీ చేశారు. ఆగష్టు 28వ తేదీ విద్యుత్ భారాలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ దినం అందరూ పాటిద్దాం అని ప్రభుత్వంపై ఒత్తిడి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోచర్ల రాధయ్య, సునీల్, చింతా శ్రవంత్, జెడ్డా లెనిన్, మన్నెం శీనయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### పొదలకూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్- ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నెల్లూరు రూరల్ డివిజన్ ఏ.సోమశేఖర్‌రెడ్డి



**నెల్లూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త –వైద్యం** నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలోని రాపూరు, నెల్లూరు రూరల్, పొదలకూరు, ముత్తుకూరు సబ్ డివిజన్ల పరిధిలోని 9 మండలాలు రాపూరు, సైదాపురం, పొదలకూరు, మనుబోలు, కలువాయి, నెల్లూరు రూరల్, మత్తుకూరు, టీపీ గూడూరు, వెంకటాచలం మండలాలు, సెక్షన్స్ రాపూరు, సైదాపురం, కలవాయి, మనుబోలు, పొదలకూరు, విరువూరు, కోడూరు, టీపీ గూడూరు, వెంకటాచలం, ముత్తుకూరు, కావేరి నగర్, బుజ బుజ నెల్లూరు, నారాయణరెడ్డి, పేట సెక్షన్స్ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక విద్యుత్ అదాలతో 13వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పొదలకూరు సబ్ స్టేషన్ నందు కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రసెల్ ఫోరం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని నెల్లూరు రూరల్స్ డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఏ.సోమశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో సీజీఆర్ ఎఫ్ చైర్ పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు, ఇన్‌ఛార్జీ టెక్నికల్ సభ్యులు జి.మధు కుమార్, ఇండిపెండెంట్ మెంబర్ డబ్ల్యూ విజయలక్ష్మీ, డిస్కం అధికారులు, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ పాల్గొంటారని తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై వ్రాత పూర్వక ఫిర్యాదు ద్వారా తెలియపరిచి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చుని తెలిపారు.

## పాఠశాలలకు కీలక ఆదేశాలు



**కోవూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మూడు రోజులకు మించి స్కూల్‌కు రాకపోతే వెంటనే వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం కనుక్కోవాలని ఈ మేరకు పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు రావడం జరిగింది. అదేవిధంగా 5 రోజుల కంటే ఎక్కువగా బడికి రాకపోతే సంబంధిత సీఆర్‌పీలు, అవసరమైతే ఎంఈవోలు ఆ విద్యార్థి ఇంటికి వెళ్లి కారణాలు కనుక్కోవాలని ఆదేశాల్లో సూచించింది. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై టీచర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు సెలవులు పెడితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రహీమ్ మాట్లాడుతూ ఇప్పటికే దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## బుచ్చిలో విఆర్ఏల నిరసన



**బుచ్చి ఆగష్టు 10 ప్రభాతవార్త** గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు బుచ్చిరెడ్డిపాలెం తహసిల్దారు కార్యాలయం బయట విఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్బంగా విఆర్ఏల సంఘం జిల్లా అద్యక్షలు లచ్చయ్య మాట్లాడుతు దశాబ్దాలుగా గ్రామ,వార్డు స్థాయిలో ప్రజలకు సర్వీసు అందిస్తున్న మా జీతాభత్యాలు మాత్రం పెరగడం లేదని ప్రస్తుత ధర 10 వేల 500 నెల జీతంతో ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. కుటుంబ నిర్వహణ బారమై పోయిందని వారు వాపోయారు. ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ సూచించన కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన విఆర్ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారిగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విఆర్ఏల సంఘం బుచ్చి మండల అద్యక్షులు చెన్నయ్య, ఉపాద్యాక్షులు అమీర్, కోశాదికారి రాధమ్మ, నూతన కమీటి సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## పొదలకూరు పిఎసిఎస్ చైర్మన్‌గా మస్తాన్ బాబు



**పొదలకూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త:** పొదలకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) చైర్మన్‌గా తలచీరు మస్తాన్ బాబు ఎంపికయ్యారు. సభ్యులుగా మొగులూరు గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, దేగపూడి గ్రామానికి చెందిన గంట మల్లికార్జున్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మస్తాన్ బాబు మాట్లాడుతూ తమకు పదవులు వచ్చేందుకు కృషి చేసిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో పొదలకూరు సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కలిగిరి పిఎసియస్ అధ్యక్షులుగా కదిరి రంగారావు



**కలిగిరి, ఆగష్టు 10, ప్రభాతవార్త;** మండల కేంద్రమైన కలిగిరి పిఎసియస్ అధ్యక్షులుగా బిజెపికి చెందిన కదిరి రంగారావును ఎంపిక చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వంప్రకటించిన పిఎసియస్ ల జాబితాలో మొత్తం 821 పిఎసియస్‌లకు అధ్యక్షులను ప్రకటించగా కలిగిరి మండలంలో 3 పిఎసియస్‌లకు అధ్యక్షులను, డైరక్టర్లను ప్రభుత్వం ప్రకటించింది.ఇందులో కలిగిరి పిఎసియస్ అధ్యక్షులుగా రంగారావు పేరును ప్రకటించింది. అదేవిదంగా డైరక్టర్లుగా గన్నమనేని శ్రీనివాసులు, సోము బాస్కర్‌రెడ్డిల పేర్లు ప్రకటించింది. కుడుముల దిన్నిపాడు పిఎసియస్ అధ్యక్షులుగా బాసిం నరిశింహులునాయుడు, డైరక్టర్లుగా మార్తుల మాలకొండారెడ్డి,డబ్బుగుంట మాలకొండయ్య (బుజియ్య) పేర్లను ప్రకటించింది. శిద్ద నకొండూరు పిఎసియస్ అధ్యక్షులుగామెట్టుకూరు క్రిష్ణజీవిరెడ్డి, డైరక్టర్లుగా రయ్యాలకొండపనాయుడు, షేక్ మౌలాలి పేర్లను ప్రకటించినట్లు తెలిసింది.





# నెల్లూరు నగరంలో వైద్య రంగాన్ని ప్రక్షాళన చేయకుంటే రోగులకు తిప్పలే

నెల్లూరులో మెరుగైన వైద్యం ఓ కలే .

**వ్యాధి నిర్ధారణ కాకపోవడంతో రోగులను నెల్లూరు వైద్యులు , తమిళనాడు లాంటి మహానగరాలకు రెఫర్ చేస్తున్నారు**

ప్రభుత్వ వైద్యుల్లోనూ కొరవడిన సేవా భావం

**ప్రభుత్వ , ప్రైవేటు రంగ వైద్యశాలలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం సరికాదు .**

హైదరాబాద్ , తమిళనాడు, బెంగళూరు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల్లో మందుల ధరలకు, నెల్లూరు వైద్యశాలల్లో మందుల ధరలకు వ్యత్యాసం

**రోగులకు వచ్చిన వ్యాధి గురించి విడమరిచి చెప్పని నెల్లూరు వైద్యులు**






**నెల్లూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త :** "ఆరోగ్యమే మహాభాగ్యం" అంటే ఆరోగ్యంగా జీవిస్తే అదే మహాభాగ్యం అన్నమాట. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంలో , మన నెల్లూరు వైద్యులు కొంతమంది.. అందులో, మహాభాగ్యాన్ని మాత్రమే స్పూర్తిగా తీసుకున్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నెల్లూరులో ఏ వ్యాధినైనా డాక్టర్లు నయం చేయగలరన్న మాట ఒకప్పటిది. ప్రస్తుతం వైద్యులు కొంతమంది మనం మహాభాగ్యవంతులం ఎలా అవుదాం, అనే ఆలోచనతోనే వైద్య సేవలు అందిస్తారనడంలో ఎలాంటి పొరపాటు లేదు. డబ్బుపై వ్యామోహం అధికమైనప్పుడు సేవా భావం సన్నగిల్లుతుంది. అందుకు ఓ ఉదాహరణ కూడా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ రంగంలో ఉండే వైద్యులు లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటూ, పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలలో మధ్యాహ్నా వరకు మాత్రమే అందుబాటులో ఉండి,, వైద్య సేవలు అందిస్తారు . సాయంత్రం వేళ సొంత వైద్యశాలలను నడుపుకుంటారు. ఇది అందరికీ తెలిసిన విషయమైనా, కొన్నేళ్లుగా జరుగుతున్నా, దీనిపై ఇప్పటికీ పరివర్తన రాకపోవడం సోచనీయం. 90 శాతం మంది ప్రభుత్వ వైద్యులు చేస్తున్నది ఇదే. ఇలాంటివి అరికడితే అందరికీ కొంతమేరకైనా చౌకైన వైద్యం అందుతుందని చెప్పవచ్చు. ఇక ప్రైవేటు వైద్యశాలల విషయానికొస్తే రోగులను అడ్డం పెట్టుకుని, కొన్ని ప్రైవేటు, సూపర్ స్పెషాలిటీ హాస్పటిళ్ళు చేస్తున్నది వ్యాపారమే. ఇంజక్షన్లు, మందుల ధరలు సామాన్యులకు తెలియవు . దీంతో సూపర్ స్పెషాలిటీ హాస్పటిళ్లలో వైద్యులే, మందుల షాపులను కూడా ఏర్పాటు చేసుకుని, వాటి ద్వారా కూడా తమ ధన దాహాన్ని తీర్చుకుంటున్నారనడంలో ఏమాత్రం సందేహం లేదు . రోగి క్రిటికల్‌గా ఉంటే 50 రూపాయలు ఉన్న ఇంజక్షన్ ధర 500 కు కూడా విక్రయిస్తుంటారు. రోగం ఒకటైతే మందు మరొకటి వేసే ఘటనలతో నెల్లూరుకు వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులు విసుగు చెందారు . అంతటితో వైద్యులు ఆగుతారా? మరో రకం మందులతో వ్యాధి నయమవుతుందన్న బుకాయింపు కూడా,చేస్తూ, రోగుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. నాలుగు రకాల మందులు వాడడం ద్వారా ఏదో ఒక మందు రోగాన్ని నయం చేస్తుందన్న విధానం వైద్యుల్లో ఉన్నంతకాలం పేద మధ్యతరగతి ప్రజలు నష్టపోతూనే ఉంటారు . ఇలాంటి ఘటనలే కాదు, నెల్లూరు వైద్యుల వైఫల్యాలను కూడా మనం ఒకసారి మననం చేసుకుంటే, పదేళ్ల క్రితం ఓ పేరు మోసిన వైద్యశాల పక్కనే ఉన్న, ఓ కంటి వైద్యశాలలో, ఉచిత నేత్ర వైద్యం పేరుతో కంటి శస్త్ర చికిత్సలు చేసి, నాసిరకం మందులు వేయడంతో దాదాపు 15 మంది రోగులు చూపు కోల్పోయి , ఆ వైద్యశాల ముందు ఆందోళనకు దిగారు. ఆ వైద్యశాలపై చర్యలు శూన్యం . నెల్లూరు దర్గామిట్టలోని ఓ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ఠాగూర్ సినిమా తరహాలో , శవానికి వైద్యం అందించి సొమ్ము చేసుకున్నారంటే ప్రజల అమాయకత్వాన్ని ఎంతగా ఉపయోగించుకుంటున్నారో దీన్నిబట్టి మనకు అర్థమవుతుంది . ఇదే ఘటన ఆ వైద్యశాలలోనే మరోమారు పునరావృతం కాగా, రోగి తరపు బంధువులు శవాన్ని ముందు పెట్టుకొని న్యాయం కోసం ధర్నాలు చేశారంటే కార్పొరేట్ వైద్య సేవలపై ప్రజలకు ఎంతవరకు నమ్మకం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు . ఇటీవలే ఒక , కాన్పులు గర్భకోశ వ్యాధుల వైద్యశాలలో, వైద్యుల వైఫల్యంతో ఓ శిశువు ప్రాణాలు కోల్పోగా , డాక్టర్ల నిరక్ష్యంతోనే తమ బిడ్డ మరణించాడని ఆందోళన చేసిన సందర్భం ఉంది . ప్రైవేటు వైద్యులు శస్త్ర చికిత్సను ప్రారంభించి, దాన్ని మధ్యలో ఆపివేసి తమ వల్ల కాదని మహానగరాలకు వెళ్ళమని రెఫర్ చేసిన సందర్భాలు దారుణం . ఇలాంటివి పునరావృతం అవుతున్నా, అలాంటి వైద్యశాలలపై చర్యలు లేకపోవడం గమనార్హం. ఇవి కొన్ని మచ్చుకు జరిగిన సంఘటనలు మాత్రమే, వెలుగులోకి రాని అనేక ఘటనలు నెల్లూరు వైద్యశాలల్లో చోటు చేసుకున్నా, వాటిపై దిద్దుబాటు చర్యలు ఏమి లేకపోవడం నెల్లూరు జిల్లా ప్రజల దౌర్భాగ్యమే . వ్యాధి నిర్ధారణ విషయంలో ఓ నిర్ణయానికి రాలేకపోవడం వైద్యుల మరియు నెల్లూరులోని వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాల వైఫల్యం తో , డాక్టర్లు వైద్య సేవలు అందిస్తూనే మధ్యలో వైద్యాన్ని ఆపివేసి, చేతులెత్తేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదేమని ప్రశ్నిస్తే తమిళనాడు, హైదరాబాదు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలకు రెఫర్ చేస్తున్నారు. ఈ చర్యలపై రోగులు లబోదిబోమంటూ చేసేదిలేక మహానగరాలకు వెళుతున్నారు. దీంతో ఇక్కడి ప్రైవేటు వైద్యశాలలల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకం కోల్పోగా , ప్రజల్లో తేలిన విషయం ఏమిటంటే , ఇది వ్యాపారమని ఇక్కడ మెరుగైన వైద్యం అందదని భావించిన రోగులు , మహానగరాల్లోనైనా మనకు మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకంతో మద్రాస్ , హైదరాబాద్ , బెంగళూరు వంటి మహా నగరాలకు వలస వెళుతున్నారు . అందుకూ నెల్లూరు నగరంలో గతంలో జరిగిన అనేక సంఘటనలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు . ఎన్టీఆర్ వైద్య సేవ , ఎంప్లాయిస్ హెల్త్ స్కీముల్లో కూడా నెల్లూరు వైద్యశాలల్లో అనేక అవకతవకలు జరుగుతున్నా , ప్రభుత్వ పర్యవేక్షణ కొరబడడంతో ఈ పథకాలు కూడా , కొంతమంది నెల్లూరు వైద్యులకు ఆదాయ వనరులుగా మారాయి . ప్రభుత్వ రంగ మరియు ప్రైవేటు వైద్యశాలలు అందిస్తున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ తోనే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయి. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంపై దృష్టి సారించి పేద ప్రజలకు న్యాయం జరిగేలా, మెరుగైన వైద్యం అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది . పేద ప్రజలు మెరుగైన వైద్యం కోసం మహానగరాలకు వెళుతున్న వైనంపై ప్రభుత్వం పరిశీలన చేసి, ప్రైవేటు రంగ వైద్య సేవలపై కొరడా ఝులిపిస్తే అనేక లోపాలు బయటపడే అవకాశం ఉంది . ఈ చర్యలతో నెల్లూరు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది

## కలువాయి సొసైటీ డైరక్టర్లుగా జనసేన నేత సురేష్‌బాబు



**కలువాయి ఆగష్టు 10 ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్,వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ ఆశీస్సులతో అలాగే తోట కృష్ణయ్య సహకారంతో ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలం పిఎస్ఎస్ డైకర్టర్లుగా జనసేన తరపున ఎన్నికైన గ్రంది సురేష్‌బాబును, జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కలువాయి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పెరం కొండ మనోహర్,పార్టీ నాయకులు ప్రవళ్ళిక, శ్రీరామ్,నాగయ్య, మాలే హరిప్రసాద్, పువ్వాడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లిపాళెంలో పాము కరిచి మహిళ మృతి



**సంగం ఆగష్టు 10 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో పాకం రావమ్మ (40) అనే మహిళను నాగపాము కాటు వేయడంతో ఆమె మృతి చెందింది. పాము కాటు వేసిన వెంటనే కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రావమ్మ మృతి చెందింది.ఈ సంఘటనతో పల్లిపాళెం గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. స్ధానికులు పామును కొట్టి చంపేశారు.

## పేకాట స్ధావరాలపై దాడి - నలుగురు పట్టివేత



**మనుబోలు ఆగష్టు 10 ప్రభాతవార్త :** మనుబోలు అరుంధతీవాడలో పేకాట ఆడుతున్నరన్న సమాచారం అందండంతో మనుబోలు ఎస్ఐ శివరాకేష్ ఆదివారం నాడు దాడు నిర్వహించగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 4200 నగదును సీజ్ చేయడం జరిగింది. మస్తాన్, మోహన్, రమేష్, మల్లికార్జున్‌ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దూదేకుల సంఘం జిల్లా యూత్ అధ్యక్షులుగా షేక్ మస్తాన్ (అగ్ని)



**ముత్తుకూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** దూదేకుల సంఘం జిల్లా యూత్ అధ్యక్షులుగా బ్రహ్మ దేవి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ (అగ్ని) ఏకగ్రీవంగా నియమించారు. రాష్ట్ర యూత్ అధ్యక్షులు డిపి మస్తాన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా యూత్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్బంగా యూత్ ప్రధాన కార్యదర్శిగా షేక్ షరీఫ్ , కోశాధికారిగా షేక్ మహమ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ అధ్యక్షులు షేక్ మస్తాన్ మాట్లాడారు. నెల్లూరు జిల్లా యూత్ అధ్యక్షులుగా మరోసారి బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కేపీర్ మహమ్మద్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు డిపి మస్తాన్‌కు ధన్యవాదాలు తెలిపినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా లోని అన్ని మండలాలకు యూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్, గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, యూత్ ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్, కోశాధికారి మహమ్మద్ తదితరులు, పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రగతిలో గిరిజనులకూ సమాన భాగస్వామ్యం లక్ష్యం - నెల్లూరులో గిరిజన సంఘాల జేఏసీ ఏర్పాటు



**నెల్లూరు రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** రాష్ట్రం అత్యున్నత స్థాయిలో అభివృద్ధి సాధిస్తున్నా, గిరిజనుల స్థితిగతులు మాత్రం మారడం లేదని గుర్తించిన గిరిజన నాయకులు, వారిలో చైతన్యం పెంపొందించి, ఉన్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు నెల్లూరు నగరంలోని హోటల్ అభిరామ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కన్వీనర్ పాలకీర్తి రవి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గిరిజనుల హక్కులు, జీవనశైలి మార్పు, సామాజిక సమానత్వం వంటి అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని పోరాటం సాగిస్తామని తెలిపారు. అత్యంత త్వరలోనే జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి, మారుమూల గ్రామాలను సందర్శిస్తూ గిరిజనుల కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ మస్తాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సముద్రాల దావీదు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చల్లా మాధవి, నాయకులు వి. చిన్నబ్బాయి, మోర్ల శివ, పులింద్ర సతీష్, ఏ. కిరణ్ కుమార్, కోళ్లకట్ల సుమన్, ఏ. శ్రీనివాసులు, జేమ్స్, చాట్ల మణి తదితరులు పాల్గొన్నారు.

## మీరు ఎప్పుడు మారుతారు ?



**కోవూరు, ఆగసు10 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేడీలుగా, అనుమానితులుగా , నేరస్తులుగా రికార్డులకెక్కిన వారు మీరు తీరు మార్చుకోరా.. ఎప్పటికి మారుతారు మీరు అంటూ కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పేర్కొన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా మీరు మారితేనే సమాజంలో మంచి మనుషులుగా చలామణి అవుతారన్నారు. ఎంతకాలం ఈ విధంగా రౌడీలుగా , కేడీలుగా ఉంటారని, ఇకనైనా తమ తీరు మార్చుకుని బుద్ధిగా మలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు ఉన్నారు.

## నూతనవధూవరులను ఆశీర్వదించిన వ మాజీ ఎమ్మెల్యే



**కావలిఆగష్టు10ప్రభాతవార్తః** డాక్టర్ రామస్వామి మల్టీస్పె షాలిటి హాస్పిటల్ బాద్యులు డాక్టర్‌రామస్వామి కుమారుడు వెంకటసౌరవ్ వివాహానికి లేకపోయినందున మాజి శాసనస భ్యుడు కాటంరెడ్డివిష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం వారి నివాసాని కివెళ్ళి నూతనవధూవరులు నిండునూరేళ్ళు సుఖసం తోషాల తో కలలకాలం కలసి వుండాలని ఆశీర్వదించారు విష్ణువర్ధన్‌రెడ్డివెంట వైసినినాయకుడుగోసల గోపాల్‌రెడ్డి అనంత బాలకృష్ణంరాజు పాలవల్లి పద్మనాభరెడ్డి పప్పు సుధాకర్‌మోహన్‌రావు బిసిఐక్యభవన్ రాష్ట్రఅధ్యక్షుడు అద్దంకిప్రభాకర్ ప్రధానకార్యదర్శి వరప్రాసద్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ఎన్నికల ప్రచారం సత్యం రెడ్డి



**విడవలూరు, ఆగష్టు 10 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను పేద ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకరం చూడడం జరిగిందని ఐటిడిపి సత్యవోలు సత్యంరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు ప్రతి బిడ్డకు తల్లికి వందనం, పథకంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో అందించారని ఆయన తెలియజేశారు. పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి మా రెడ్డి లలిత రెడ్డికి ఆదివారం నల్లగొండ వారి పల్లె లో గడప గడప ఎన్నికల ప్రచారం చేయడం జరిగింది అందులో విడవలూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల పై పోలీసుల ఉక్కు పాదం

**విడవలూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త:** మండలంలోని జూదం ఆడుతున్న వ్యక్తులను గుర్తించి అలాంటి వారిపై నిఘ ఉంచి పైఅధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు పూర్తిపరిశీలన చేయడం జరుగుతుందని స్థానిక ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదివర్తి గ్రామంలో అయిన పెన్నా తీరంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి 4000 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని ఇలాంటి సంఘటనకు పాల్పడితే పై అధికారులకు తెలియపరచి కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

## ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఎన్నికలు ఏకగ్రీవం



**ఆత్మకూరు , ఆగస్టు10,ప్రభాతవార్త :** ఆత్మకూరులో ఆదివారం నిర్వహించిన ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. రెవెన్యూ డివిజన్ అధ్యక్షులుగా ఉదయగిరి తహసిల్దార్ ఎల్.రామ్మోహన్, కార్యదర్శిగా ఆత్మకూరు డిప్యూటి తహసిల్దార్ డి.శాంతిస్వరూప్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏఎస్‌పేట డిప్యూటీ తహసిల్దార్ జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సంధ్య మిగిలిన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా నెల్లూరుకు చెందిన ఎం.డి.గయాజ్ , ఉపఎన్నికల అధికారిగా జి.సతీష్‌కుమార్, శేషయ్యలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫలితాలను వెల్లడించిన ఎన్నికల నిర్వహణాధికారి ఎం.డి.గయాజ్ ఏకగ్రీవంగా ఎంపికైన సభ్యులచే ఎన్నికల నియమాల ప్రకారం ప్రమాణస్వీకారం చేయించి వారికి నియామక పత్రాలు అందించారు. ఈఎన్నికల్లో ఏకగ్రీవంగా తనను ఎంపిక చేసిన సభ్యులకు అధ్యక్షులుగా ఎంపికైన ఎల్.రామ్మోహన్ ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా నెల్లూరుజిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెంచలరెడ్డి మాట్లాడుతూ తమ రాష్ట్ర నాయకత్వం పై ఉన్న నమ్మకంతో ఈ ప్రాంత సభ్యులు ఆత్మకూరు డివిజన్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లాలోని మిగిలిన కార్యవర్గ అసోసియేషన్ ఎన్నికలు కూడా పూర్తయిన తర్వాత జిల్లా ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహిస్తామన్నారు. తమ కార్యవర్గంపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై తాము నిరంతరం పోరాడి సాధిస్తామన్నారు. ఎన్నికల్లో డివిజన్ స్థాయిలో మొత్తం 73మంది ఓటర్లు ఉండగా 15మంది కార్యవర్గ సభ్యులుగా పోటీ చేసి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నియ్యారు.

## శకునాలపల్లి పంచాయతీలో ఆదాని స్మార్ట్ మీటర్ల రద్దుకై ధర్నా



**ఉదయగిరి, ఆగష్టు 10, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని శకునాలపల్లి పంచాయతీలో ఆదివారం ధర్నా సీపీఎం పార్టీ ఉదయగిరి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో సుగుణాలపల్లి పంచాయతీలో ధర్నా చేయడం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ నాయకులు గ్రామాలలో ధర్నాలు నిర్వహిస్తున్నారు. సీపీఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి కోడి రమణయ్య సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే వ్యతిరేకించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఎలా బిగిస్తారని ప్రశ్నించాము గత ప్రభుత్వం 32 వేల కోట్లు రూపాయలు ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో 30 వేల కోట్లు రూపాయలు ప్రజలపై భారాలు వేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించుకుని పాత మీటర్లనే ఉంచాలని ఆదాని స్మార్ట్ మీటర్లు నిలుపుదల చేసి ప్రజల పక్షాన నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.వెంకటేశ్వర్లు, నాగరాజు, చిన్న రమణయ్య, వెంకటాద్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ భారీ ట్రాక్టర్‌ర్యాలీ



**ఉదయగిరి, ఆగష్టు 10, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో బుధవారం మధ్యాహ్నం జరుగుతున్నటువంటి సూపర్ సిక్స్‌లో భాగమైన అన్నదాత సుఖీభవ అమలుకు శ్రీకారం చుట్టిన కూటమి అది నాయకులకు లీగల్ సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం దుత్తలూరు మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి ఉదయగిరి మండల కేంద్రంలోని అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డు వరకు భారీ ర్యాలీ చేపట్టడం జరుగుతుందని కావున ఉదయగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ జనసేన బీజేపీ పార్టీ నాయకులు ప్రతి పంచాయతీ నుండి రైతన్నలు ఈ ట్రాక్టర్ ర్యాలీలో తప్పక పాల్గొనేలా చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని లీగల్ సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

## వైభవంగా అభిషేకాలు



**కోవూరు , ఆగస్టు10 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి అకల్మష హోమం, పంచగవ్యాప్రాసనం, పవిత్రములకు ఆదివాసములు, మహానైవేద్యం కార్యక్రమాలను సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా సీహెచ్ శివభాస్కర్ రావు,ఎన్. శివకుమార్, ఎం. వెంకట సురేంద్ర, ఎం. మల్లికార్జునరావు, బి. వెంటేశ్వ ర్లురెడ్డి, ఎం. వెంకటేష్ వ్యవహ రించారు. ప్రసాదానికి ఉభయ కర్తలుగా వీరాంజనేయ స్వామి క్యాటరింగ్ వ్యవహరించారు. రుత్వికులు శ్రీకాంతాచార్యులు,రాఘవాచా ర్యులు, కృష్ణమాచార్య స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

- **వైభవంగా గంగాభిషేకం** స్వామివారి పవిత్రోత్సవాల సందర్భంగా స్థానిక గంగమ్మ దేవాలయంలో ఉన్న బావి నుంచి పవిత్ర జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకుని వచ్చి ఆ జలాలతో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో రుత్వికులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ కార్య క్రమాలను ఘనంగా చేపట్టారు.



## ప్రైవేటు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**ఉదయగిరి, ఆగష్టు 10, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఉన్నటువంటి ప్రైవేటు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని అలాగే కాలం ముగిసిన వెంటనే రెన్యువల్ చేసుకోవాలని ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ ప్రత్యేక అధికారి డాక్టర్ కే.మురళీధరన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రులలో ఉన్న వసతులను రిజిస్ట్రేషన్ వైద్యుల వివరాలను ఫార్మసీ ల్యాబ్‌ను పరిశీలించి రిజిస్ట్రేషన్ లేని వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ బాబు, ఆరోగ్య విద్య వైద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్లస్డ్స్ హోమ్ విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలు



**కావలి, ఆగష్టు10,ప్రభాతవార్తః**కావలి పట్టణం కచేరిమిట్టలో వున్న మీకోసం స్వఛ్చందసేవాసంస్థ నిర్వహిస్తున్న బ్లస్డ్స్ హోమ్‌లోని విద్యార్థుల మధ్య ప్రముఖ అంతర్‌జాతీయ పారిశ్రామికవేత్త తండ్రి వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగ మీకోసం స్వశ్చందసేవాసంస్థ వ్యవస్తాపక అద్యక్షుడు దిలీప్‌కుమార్ రాయపాటి మాట్లాడారు. ఖండా ంతరాలుదాటిన జన్మభూమి మీద, పేదలపైన వున్న ప్రేమతో అనేక సంవత్సరాలుగ సేవా కార్య క్రమాలు చేపడుతున్న కండే వెంకటేశ్వర్లు తనకున్న సామాజిక స్పృహ గొప్పదన్నారు.కండే వెంకటేశ్వర్లులాంటి వారు సమాజంలో మరెంతో మంది తయారైతే సమాజంలో వుండే కొన్ని అసమానతలు కొంతవరకు తొలగి పోతాయని తెలిపారు.చదువువిలువ తెలిసిన కండే పేదవిద్యార్థుల చదువుకు అవసరమైన స్టేషనరి, పండ్లు,ఆహారం అందించి వారిపట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు గొప్పవని కొనియాడారు.కండే వెంకటేశ్వర్లు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ఆశీస్సులతో మరింత ఉన్నతస్థితికి ఎదగాలని కోరుతు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కండే వెంకటేశ్వర్లు చిన్ననాటి స్నేహితులు డిప్యూటి తహసిల్‌దార్ మల్లి నరేష్ మాట్లాడారు .ప్రాణమిత్రుడైన కండే వెంకటేశ్వర్లుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతు చిన్ననాటినుంచి కష్టపడి చదివి మంచి వున్నతస్థాయిలో వున్నందుకు చాలా సంతోష దాయక మన్నారు. హోమ్ పిల్లలు అందరు కండేలాంటి వారిని ఆదర్శంగ తీసుకొని అతనిలా కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి రావాలని కోరారు .అందరు శుభ్రతను పాటిస్తు చదువుతోపాటు క్రీడల్లో కూడా బాగా రాణిం చాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ఏగూరి దాసు గాలి ప్రసాద్,కత్తి పుల్లయ్య, డానియల్‌బాబ్జి, కత్తి సందీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యుటిఎఫ్ 52వ ఆవిర్బావ దినోత్సవం




**కావలి, ఆగష్టు10,ప్రభాతవార్తః**ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యు.టి.ఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్బంగ ఆదివారం కావలి యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు షేక్ షాబ్జి యుటిఎఫ్ జండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు .ఈ సందర్బంగ యుటిఎఫ్ గానగంధర్వులు రమణయ్య మరియు వారి మిత్రబృందం యుటిఎఫ్ గీతాలను ఆలపించి యుటిఎఫ్ అమర వీరులకు అంజలి ఘటించి వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్య దర్శులు ఐహెచ్ఎల్ ప్రసాద్,బెల్లం మాధవరావు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు విశ్రాంత ప్రధానో పాధ్యా యులు షరాబు సత్యన్నారాయణ,ఆకుల రమణయ్య,షేక్ గౌస్‌బాష కావలి డివిజన్‌లోని అన్ని మండలాల జిల్లా కౌన్సిలర్లు,అద్యక్ష ప్రధానకార్యదర్శులు మండలాల భాద్యులు సీనియర్ నాయకులు కార్యకర్తలు యుటిఎఫ్ కుటుంభ సభ్యులు పాల్గొన్నారు.

## గౌస్‌భాష మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కావలి, ఆగష్టు10,ప్రభాతవార్త :** కావలి పట్టణం 19వార్డుకు చెందిన టిడిపి కుటుంభసభ్యుడు షేక్ గౌష్‌బాష ఆదివారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్ళి గౌస్‌బాష పార్ధివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.వారి కుటుంభ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుబూతిని తెలిపారు.ఎంఎల్ఎ వెంట 19వవార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఏగూరి చంద్రశేఖర్,టిడిపి నాయకులు వున్నారు.

## వైభవంగా మహా శాంతి హోమం



**కోవూరు , ఆగష్టు 10 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా శాంతి హోమం, అగ్ని గుండాలకు పవిత్రాల సమర్పణ, విశేష హోమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు శ్రీకాంతాచార్యులు, రాఘవాచార్యులు, కృష్ణమాచార్య స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.



## వవ్వేరు బ్యాంకు చైర్మన్‌గా దొడ్ల విజయలక్ష్మీ
## బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్‌గా ఏటూరు శివరామకృష్ణారెడ్డి



బుచ్చి ఆగష్టు 10 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలంలో అత్యంత కీలకమైన వవ్వేరు బ్యాంకుకి చైర్మ న్‌గా దొడ్ల విజయలక్ష్మీ ని ప్రకటిస్తు ఆదేశాలు అందాయి. దొడ్ల విజయ లక్ష్మీ గతంలో బుచ్చిరెడ్డిపాళెం ఎంపిపిగా కూడా చేసి వున్నారు. ఈవిషయం తెలిసి దొడ్ల కుటుంబం అభిమానులు హర్షం వ్యక్తం చేసున్నారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం దొడ్ల విజయలక్ష్మీని నియమించారని నాయకులు ప్రశంసిస్తున్నారు.

అలాగే బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు చైర్మన్‌గా రేబాలకు చెందిన ఏటూరు శివరామకృష్ణారెడ్డిని నియమిస్తు ఆదేశాలు అందాయి. గతంలో కూడా శివరా మకృష్ణారెడ్డి బ్యాంకు చైర్మన్‌గా చేసి వున్నారు. త్వరలోనే ప్రమాణ స్వీకారం ఉండవచ్చునని తెలిసింది.



## వేటకువెళ్ళి ప్రమాదవశాత్తు మృతిచెందిన యువకుల మృతదేహాలను పరిశీలించిన ఎమ్మెల్యే



కావలి, ఆగష్టు10, ప్రభాతవార్త:కావలి రూరల్‌మండలం తుమ్మలపెంట సముద్రంలో వేటకువెళ్ళి ప్రమాదవశాత్తు మృతిచెందిన తుమ్మలపెంట పల్లెపాళెంకు చెందిన ఐలా శివకృష్ణ(21), ఉయ్యాల విష్ణు(19)ల మృతదేహాలను కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం ఏరియా వైద్యశాలకు వెళ్ళి పరిశీలించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడారు. సముద్ర వేటకువెళ్ళిన ముగ్గురిలో ఇద్దరు మృతిచెందడం చాలా భాదాకరమ న్నారు. మృతుల కుటుంబలకు ప్రభుత్వంనుంచి వచ్చే ఆర్థికపరమైన సహాయాలకు కృషిచేస్తామని తెలి పారు. బోటులో పోకుండ వేటకు పోవడంతోనే వారిద్దరు మృతి చెందారని అభిప్రా యపడ్డారు.




## కాకాణి పూజితరెడ్డిని అభినందించిన జట్ల కొండూరు వైసిపి నాయకులు

**మనుబోలు ఆగష్టు 10 ప్రభాతవార్త** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజితరెడ్డికి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవి రావడం పట్ల కొండూరు సత్రంకి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ అయినటువంటి ఆవుల తులసీరామ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆ గ్రామ నాయకులు కార్యకర్తలు ఆదివారం నాడు నెల్లూరులోని ఆమె నివాసంలో ఆమెకు పుష్ప గుచ్చం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మేము మరియు గ్రామ ప్రజలు ఎల్లప్పుడు ఆమెకు అండగా ఉంటామని ఆమెకు మరెన్నె పదవులు రావాలని భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు.



## పేదలకు అండగా సీఎం సహాయనిధి

- నెల్లూరు రూరల్‌లో 22 మందికి రూ.18 లక్షల చెక్కుల పంపిణీ
- అవసర సమయాల్లో సీఎం సహాయనిధి
- పేదలకు నిజమైన వరం
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలకూ సాయం
- టిడిపి నాయకులు గిరిధర్ రెడ్డి
- చంద్రబాబుకు నెల్లూరు రూరల్ ప్రజల తరపున కృతజ్ఞతలు



నెల్లూరు **రూరల్, ఆగష్టు 10, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పేదల ఆరోగ్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.18 లక్షల చెక్కులను 22 మంది లబ్ధిదారులకు ఈ ఉదయం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారు, అలాగే ఇతర రాష్ట్రాల్లోని ఆసుపత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు.

## టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తా : మంత్రి నారాయణ

- టైలర్లకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుంది
- టైలర్స్ కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు సహకారం అందిస్తానన్న మంత్రి
- మంత్రికి శాలువాలతో సన్మానించిన నెల్లూరు జిల్లా టైలర్స్ అసోసియేషన్ నేతలు



**నెల్లూరు, ఆగష్టు 10, ప్రభాతవార్త- వైద్యం** టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో మంత్రితో నెల్లూరు జిల్లా టైలర్స్ అసోసియేసన్ నేతలు భేటీ అయ్యారు. టైలర్స్ కమ్యూనిటీ హాల్‌ఏర్పాటుకు మీ సహకారం కావాలని నేతలు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి కమ్యూనిటీ హాల్ కోసం తన వంతు సహకారం ఖచ్చితంగా అందిస్తానని మంత్రి నారాయణ తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల నెల్లూరు జిల్లా టైలర్స్ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రికి శాలువాలతో సన్మానించి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.బాబు, కార్యదర్శి పి.యానాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మురళీకృష్ణ, సిటీ అధ్యక్షులు గులాం ఖాదర్, జిల్లా ట్రెజరర్ ఎస్‌కే బాబు, జిల్లా ఉపాధ్యక్షులు వి.శీనయ్య తదితరులు ఉన్నారు.

## పనిచేయని వాటర్ ప్యూరిఫైర్ మిషన్లు.. - అవస్థల్లో రోగులు, బాలికలు







కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త : గతంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన హరినారాయణన్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా లక్షలాది రూపాయలు వ్యయం చేసి కోవూరు మండలంలోని బీసీ బాలికల వసతి గృహానికి , కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రెండు వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌లను గతంలో అందజేశారు. ఇవి ఏర్పాటు చేసిన కొద్ది దినాలకే మరమ్మతులకు గురయ్యాయి. వీరు సంబంధిత కంపెనీకి సమాచారం ఇచ్చినా వారు ఆశించిన మేర స్పందిస్తున్న దాఖలాలు లేవు. ఆస్పత్రి వైద్యులే తమ నిధులతో మరమ్మతులు చేయించినా మరలా అవి మరమ్మతులకు గురయ్యాయి. అదేవిధంగా బీసీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసినవాటర్ ప్యూరిఫైర్ మిషన్ మరమ్మతులకు గురి కావడంతో సంబంధిత సంక్షేమాధికారిణి వేలాది రైపాయలు వ్యయం చేసి మరమ్మతులు చేయించింది. అయినా కూడా అవి సక్రమంగా పనిచేసిన దాఖలాలు లేవు. ఆస్పత్రిలోని రోగులకు, వసతి గృహంలోని బాలికలకు సురక్షిత నీరు ఇవ్వాలని ఉద్దేశంతో వారికి ఈ ప్యూరిఫైర్ మిషన్ ద్వారా నీరు ఇవ్వాలని ఉద్దేశంతో అప్పటి జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ నిధుల కింద వీటిని సమకూర్చారు. ప్రస్తుతం ఈ రెండు మిషన్లు పనిచేస్తున్న దాఖలాలు లేవు. దీంతో బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు శుద్ధి చేసిన నీరు అందిస్తామన్న సంబంధిత అధికారులు, పాలకుల మాటలు ఆచరణలో విఫలమవుతున్నాయి. ఫలితంగా బోరు నుంచి వచ్చే నీరే తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాత్రం రోజుకు 200 నుంచి 300 రూపాయలు ఖర్చు పెట్టి బయట నుంచి వాటర్ క్యాన్‌లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ రెండు ప్యూరిఫైర్ మిషన్‌లను మరమ్మతులు చేయించి ఆచరణలోకి తెచ్చేలా చొరవ తీసుకోవాలని ఆస్పత్రికి వచ్చే రోగులు, బాలికలు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ప్రజలే మా బలం - అభివృద్ధే మా లక్ష్యం

- పాతవెల్లంటి అరుంధతివాడలో 15 లక్షల కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన

- ప్రజల విశ్వాసం - మా శక్తి- కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, ఆగష్టు 10, ప్రభాతవార్త** మూడుసార్లు భారీ మెజారిటీతో గెలిపించి, కుటుంబ సభ్యుడిలా ఆదరించారు. మీ విశ్వాసమే నాకు, నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి ఎప్పటికీ బలాన్నిస్తుంది అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా మేము ఎప్పుడూ మీ మధ్యే ఉంటాం. మీ సమస్యలు మా సమస్యలే అని హామీ ఇచ్చారు.

- **అభివృద్ధి పథంలో మరో అడుగు** పాతవెల్లంటి గ్రామం అరుంధతి వాడలో రూ.15 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేశారు. ఈ హాల్ మీ అందరికీ సామూహిక కార్యక్రమాల వేదిక అవుతుంది. వివాహాలు, శుభకార్యాలు, సాంస్కృతిక వేడుకలు, గ్రామ సమావేశాలు ఏ సందర్భమైనా ఈ భవనం మీ కోసం అని ఎమ్మెల్యే అన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు ఈ ప్రాజెక్ట్ ఆమోదం పొందిందని, భవిష్యత్తులో ఇంకా ఎక్కువ అభివృద్ధి పనులు రానున్నాయని తెలిపారు.
- **సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు** నెల్లూరు రూరల్ అభివృద్ధి కోసం అడిగిన ప్రతీ పనికి వెంటనే అనుమతులు మంజూరు చేస్తున్న మా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టి, అభివృద్ధి పట్ల నిబద్ధత వల్లే సాధ్యమైంది" అని పేర్కొన్నారు.
- **రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి** పిలుపు గ్రామాల ప్రగతి కోసం మనమందరం కలిసిరావాలి. రాజకీయ భేదాలు పక్కన పెట్టి, ఏకమై ముందుకు సాగుదాం అని ప్రజలకు పిలుపునిచ్చారు. మన గ్రామం మన గర్వం దాన్ని అభివృద్ధి చేయడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు రూరల్ టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓలేటి మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటు



**కావలి, ఆగష్టు10, ప్రభాతవార్త:** సీనియర్ పాత్రి కేయులు ప్రముఖ ఆర్యవైశ్యనేత ఓలేటి నాగేశ్వ రరావు మృతి పాత్రికేయ రంగానికి వ్యక్తిగతంగ నాకు తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కావలి పట్టనం లోని ఓలేటి నాగేశ్వరరావు నివాసానికి ఆదివా రం విష్ణువర్ధన్‌రెడ్డి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా వుంటా మని తెలిపారు. ఓలేటి నాగేశ్వరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓలేటి పాత్రికే యులుగా రాణిస్తు ఆర్య వైశ్యులకు అండగవుంటు వారి సమస్యలపట్ల స్పందిస్తు సామాజికంగా, సమాజసేవలో తమవంతు పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆశయాలను కావలి జర్నలిస్టులు కొనసాగిం చాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాకు అనారోగ్య సమస్యతో ఆయన మృతిచెందిన రోజు రాలేకపోయానని భగవం తుడు వారి కు టుంబనికి అండగవుండాలని ఆకాంక్షించారు. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి వెంట వైసిపి సీనియర్ నాయకులు కృష్ణంరాజు, గోసల గోపాల్‌రెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేసిన మంత్రి నారాయణ

- గత ఎన్నికల ప్రచారంబ వీధి వ్యాపారుల జీవనశైలి కళ్లారా చూశాను
- అద్దె చెల్లించే అవసరం లేకుండా వారికి సొంత నిధులతో బండ్లు ఇచ్చాను
- ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొటిగా నెరవేరుస్తామని మంత్రి హామీ
- నెల్లూరు సిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతాను
- మంచి చేస్తుంటే కొందరు విమర్శలు చేస్తున్నారు
- ఎవరు ఎన్ని చేసినా నా సంకల్పం ఆగదు మంత్రి నారాయణ వెల్లడి






**నెల్లూరు, ఆగష్టు10, ప్రభాతవార్త-వైద్యం** నిరుపేదరికం నుండి వచ్చాను కాబట్టే పేదల కష్టాలుతెలుసని, అందుకే తన సొంత నిధుల నుండి నిరుపేదలకు సహాయం అందిస్తున్నానని రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. చాలా మందిచిరు వ్యాపారులు సంపాదనలేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని మంత్రి నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అండగా నిలిచేందుకు తన వంతు సాయంగా తోపుడు బండ్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్క రోజే 47 మంది పేదల కు తోపుడు బండ్లు అందజేశామని తెలి పారు. అందులో 41తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లు, ఒకరికి రిక్షా అందించినట్లు తెలిపారు. నేను తాటాక గుడిసెలో పుట్టానని కడు పేదరికాన్ని అనుభవించాను కాబట్టే కష్టపడి ఈ స్థాయికి వచ్చానన్నారు. పేదల కష్టాలు తెలుసుకున్నాను కాబట్టే నా వంతు సహాయం అందిస్తున్నానని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వీధి వ్యాపారుల జీవనశైలి చూశానని, అద్దెకు బండి తీసుకొని వ్యాపారాలు చేసుకొని ఇబ్బందులు పడ్డారని, అందుకే అద్దె చెల్లించే అవసరం లేకుండా తోపుడు బండ్లు అందజేశానని మంత్రి తెలిపారు. నిరుపేద పిల్లల కోసం వీఆర్సీని అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేశామన్నారు. దానిపైన కూడా కొందరు విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని చేసినా నా సంకల్పం ఆగదని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి 12 హైస్కూల్‌ను వీఆర్సీ తరహాలోని సిద్ధం చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. సీఎం మానసపుత్రిక అయినటువంటి పీ 4 కింద పేదలకు చేయూత ఇవ్వాలని, నా పిల్లలు కూడా సంకల్పించారని తెలిపారు. మాది పేదల ప్రభుత్వం అని అన్నారు. భగత్ సింగ్ కాలనీ వాసుల శాశ్వత పట్టాలు పంపిణీ ఓ నిదర్శనమని మంత్రి నారాయణ తెలిపారు. దశాబ్దాల కల నెరవేరడంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. నెల్లూరు సిటీని మోడల్ సిటీగా తీర్చి దిద్దుతానని ఇచ్చిన హామీలను ఒక్కోడిగా నెరవేరుస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలకు దూరంగాయువత ఉండాలి



**కోవూరు, ఆగష్టు 10 ప్రభాతవార్త :** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని , వీటి వలన అనేక నష్టాలు ఉన్నాయని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లా డు తూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నా య న్నారు. దీని పట్ల యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నా రు. మాదకద్రవ్యాలు వినియోగించడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణిస్తాయన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వ్యక్తి తమ శరీరంపై అదు పు కోల్పోతారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, అమ్మినా, కలిగి ఉన్నా ఆ వ్యక్తులను చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల్లో బాధితులు కాకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ద్విచక్ర వాహనం నిడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఈ సందర్భంగా ఆయఅన్నారు.

**మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు –** రాత్రి వేళల్లో రహదారిపై మద్యం సేవించి వాహనాలు నడిపే వాహన చోదకులపై శాఖపరంగా కఠినచర్యలు తప్పవని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డిఅన్నారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక దృష్టిసారించి బ్రీత్ ఎన్‌లైజర్ పరికరం ద్వారా మద్యం సేవించిన వారిని గుర్తించి వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నామన్నారు. మద్యం సేవించి రాత్రి వేళలో వాహనాలు నడిపితే అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. . గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరుగుతుంటే అటువంటి వారి సమాచారాన్ని సమీపంలో ఉన్న పోలీస్‌స్టేసన్‌కు చేరవేయాలన్నారు

## అక్రమ కేసులు బనాయించే వారిపై చర్యలు తీసుకోవాలి



**చేజర్ల ఆగష్టు 10 ప్రభాతవార్త** ప్రభుత్వ భూమికి సంబందించి హైకోర్టులో ఫిటీషన్ కొట్టి వేసినా వైసిపి నేతల ఆగడాలు యదేచ్ఛగా కొనసాగుతున్నా అక్రమ కేసులు బనాయిస్తున్నారని బాధితుడు ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా వివరాలు తెలియజేశారు. చేజర్ల మండలం మడపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 1255 లో పెన్నా పోరం బోకు ప్రభుత్వం భూమి కొంత వుంది. ఆభూమిని మాగ్రామానికి చెందిన వైసిపి నాయకురాలు లింగంగుంట వసంతమ్మ ఇటీవల కబ్జా చేయడంతో దీన్ని గమనించిన మండల రెవిన్యూ అధికారులు ఆభూమి పెన్న పోరంబోకు ప్రభుత్వ భూమి కాబట్టి ఈ భూమిని ఎవ్వరు ఆక్రమించినా సాగు చేసినా శిక్షార్హులు అని విషయాన్ని తెలుపుతు ఒక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహించిన వైసిపి మహిళ నేత హెచ్చరిక బోర్డు పెడుతున్న సమయంలో అధికారులను దుర్భాషలాడుతు ఆబోర్డును తొలగించింది. ఇదే విషయాన్ని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి రిట్‌ఫిటీషన్ వేసింది. ఆభూమికి సంబందించి ఎలాంటి పత్రాలు ఆధారాలు చూపకపోవడంతో రాష్ట్ర హైకోర్టు ఆఫిటీషన్‌ను కొట్టి వేసింది. వైసిపి నేతకు న్యాయం జరగలేదన్న ఆవేదనతో అంతటితో ఆగకుండా ఆ భూమిని ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 567 -1/2 పట్టా భూమి సుమారు 5 ఏకరాలు ఉంది. ఆభూమిని చలమల సుబ్బారెడ్డి అనే రైతు కౌలుకు చేసుకుంటున్నాడు. తనపైన అధికారులను వుసి గొలుపుతున్నారని భావించిన వైసిపి మహిళ ఆగ్రహించి చలమల సుబ్బారెడ్డి ఆయన బందువులపై ఎస్‌సి, ఎస్‌టి తప్పుడు కేసు బనాయించారని వాపోయారు. వాస్తవానికి ఆగష్టు 6 వ తేది 7 గంటలకు మేము పొలంలోకి వెళ్ళ లేదని ఆమహిళా నేతను దాడి చేయలేదని, దుర్భాషలాడలేదని, మేము ఆ సమయంలో మా ఇంటిలో ఉన్నామని తెలియజేశారు. ఒ పథకం ప్రకారమే మమ్మల్ని కేసులలో ఇరికించారని బాధితులు వాపోయారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడేమేకాకుండా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తు దళిత సంఘాలును సైతం తప్పుదోవ పట్టించేలా చేస్తుందని తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తు ఆశాంతిపి నెలకొల్పుతుందని అన్నారు. జిల్లా అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈవిషయంపై తహసిల్దారు బి.మురళీని వివరణ కోరగా సర్వేనెంబర్ 1255లో పెన్నాపోరంబోకు ప్రభుత్వ భూమి అని అందులో ఎవ్వరు ప్రవేశించినా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

## సంగం పిఎసిఎస్ నూతన కమిటీ అధ్యక్షుగులు గుండ్లపల్లి





**సంగం ఆగష్టు 10 ప్రభాతవార్త** సంగం పిఎస్ఎస్ నూతన కమీటిని నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. పిఏసిఎస్ అధ్యక్షులుగా గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, డైరక్టర్లుగా పిట్టు పట్టాభిరామిరెడ్డి, చేవూరుజ నార్దన్‌రెడ్డిని నియమించడం జరి గింది. ఈ సందర్భంగా కమీటి వారు మాట్లాడుతు మాకు ఈ పదవులు ఇచ్చినందుకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పిఏసిఎస్ అభివృద్దికి పూర్తి స్ధాయిలో కృషి చేస్తామని అన్నారు.